ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 16 జూలై 2025



ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 24.0

బొమ్మనహాల్ మండలంలో ఓ ఏటిగడ్డున ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌గా కొనసాగుతోంది. ఆ పాఠశాలకు కాంప్లెక్స్ గ్రాంట్ మార్చిలో రూ.లక్ష వచ్చింది. మొత్తం డ్రా చేశారు. బోగస్ ఓచర్లతో ఖర్చు చూపించారు. హెచ్ఎం బదిలీ అయ్యాడు. అక్కడ బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంను ఎల్‌పీసీ ఇమ్మని అడిగితే స్కూల్ గ్రాంట్ ఖర్చుకు సంబంధించిన ఆధారాలు చూపితేనే ఇస్తానంటున్నారు. దీంతో అక్కడ వివాదం నడుస్తోంది.

పుట్లూరు మండలంలోని ఓ కాంప్లెక్స్ హెచ్‌ఎం తన పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లకు పైసా కూడా నిధువ్వలేదట. రూ.లక్ష ఎంచక్కా డ్రాచేసి మింగేసారట. అడిగితే తాను బదిలీ అయ్యాననీ, ఉన్న వారితో ఇప్పించుకోండని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారట. దీనిని బట్టి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఏస్థాయిలో బరితెగించారో అర్థం చేసుకోవచ్చు.

గుత్తి మండలంలోని ఓ హెచ్‌ఎం కాంప్లెక్స్ నిధుల్లో మాయాజాలం చూపుతున్నారట. తన పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణకు రూ.25 వేలు ఖర్చు కింద టీఏ రాసుకున్నారట. ఇలాగే జిల్లాలో అన్ని కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పర్యవేక్షణ పేరున రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు టీఏ రాసుకున్నారనే చెబుతున్నారు. ఇవి కేవలం కొన్ని మాత్రమే. ఇలాంటి లీలలు ఎన్నో ఉన్నాయి.



స్కూల్ గ్రాంట్ గుటుక్కు..!

కాంప్లెక్స్ నిధుల వినియోగంలో అక్రమాలు

రెండే సమావేశాలు.. రూ.లక్ష మాయం
జిల్లావ్యాప్తంగా రూ.1.35 కోట్లు ఖర్చు
బోగస్ ఓచర్లతో మాయ
పైసాలేక కొత్త హెచ్‌ఎంలు లబోదిబో
చోద్యంచూస్తున్న జిల్లా అధికారులు

అనంతపురం విద్య, జూలై15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పఠనా సామర్థ్యాలు పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టి నిధులు ఇస్తున్నాయి. వాటిని పాఠశాలలు, పిల్లల కోసం ఖర్చుపెట్టకుండా పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇందుకు స్కూల్ కాంప్లెక్స్ నిధుల గోల్‌మాల్ వ్యవహారమే నిదర్శనం. కూటమి సర్కారు ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌కు రూ.లక్ష చొప్పున నిధులిచ్చింది. వాటిని సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంలు స్వాహా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు సమావేశాలు నిర్వహించి, తమ పరిధిలోని పాఠశాలలకు పైసా ఇవ్వకుండా మొత్తం ఖర్చుపెట్టినట్లు లెక్కలు చూపించేశారు. కొత్తగా ఆ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు కాంప్లెక్స్ గ్రాంట్ పైసా కూడా లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. దీంతో బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన హెచ్‌ఎంల మధ్య వార్ నడుస్తోంది. జిల్లా విద్యాశాఖలో ఇది హాట్ టాపిక్‌గా మారింది.

స్కూల్ కాంప్లెక్స్ ఆశయం ఇదీ..

పాఠశాలల నిర్వహణ, అడ్మిషన్లను జిల్లా, మండలస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించలేరన్న ఉద్దేశంతో కాంప్లెక్సులు ఏర్పాటు చేశారు. ఓ ఉన్నత పాఠశాలను చేస్తారు. ఆ హెచ్‌ఎంకు కాంప్లెక్స్ పరిధిలోని 15 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తారు. టీచర్లకు కాంప్లెక్స్ మీటింగ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వం స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణకు ప్రత్యేకంగా నిధులిస్తోంది. అలాంటి స్కూల్ కాంప్లెక్స్‌లు అక్రమాలకు కేరాఫ్‌గా మారాయి. జిల్లాలో 135 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఇవి నిబంధనల మేరకు పనిచేయడం లేదు. సంబంధిత హెచ్‌ఎంలు తమకేమీ సంబంధంలేదనే భావనతో సాగుతున్నారు. కాంప్లెక్స్‌కు వచ్చే నిధులు మాత్రం ఎంచక్కా అడ్డదారుల్లో బొక్కేస్తున్నారని వాటి పరిధిలోని టీచర్లే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

రెండే మీటింగ్‌లు.. రూ.లక్ష ఫట్..

వైసీపీ ప్రభుత్వం అంతకు ముందు రెండేళ్లపాటు కాంప్లెక్స్‌లకు పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో తూతూమంత్రంగా కాంప్లెక్స్ వ్యవహారాలు సాగిస్తూ వచ్చారు. కూటమి సర్కారు కొలువుదీరాక పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కూడా నిధులు చకాచకా ఇస్తున్నారు. ప్రతిస్కూల్ కాంప్లెక్స్‌కు రూ.లక్ష చొప్పున గ్రాంట్‌ను ఇచ్చారు. ఇలా జిల్లాలో 135 కాంప్లెక్స్‌లకు రూ.1.35 కోట్లు విడుదల చేశారు. అదికూడా 2024-25 విద్యా సంవత్సరం ఆఖర్లో మార్చిలో ఇచ్చారు. గత విద్యాసంవత్సరంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో మాత్రమే కాంప్లెక్స్ మీటింగ్‌లు జరిగాయి. నిబంధనల మేరకు సమావేశాలకు వచ్చే టీచర్లకు టీ, కాఫీ, బిస్కెట్, తాగునీరు వంటి వసతులు కల్పించాలి. టీచర్ల (మిగతా 4లో...)

నేడు రామగిరి ఎంపీపీ ఉపఎన్నిక

పటిష్ట బందోబస్తు ఏర్పాటు



ఎంపీపీ ఎన్నికకు చేసిన ఏర్పాట్లు

రామగిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఉప ఎన్నిక బుధవారం నిర్వహించనున్నారు. అధికారులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. రామగిరి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు గదిలో ఎన్నిక నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉప ఎన్నికకు వైసీపీ ఎంపీటీసీ సభ్యులే కీలకం. వారు గైర్హాజరయ్యే అవకాశం ఉండటంతో ఎన్నిక జరుగుతుందా, లేదా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వైసీపీ సభ్యులు ఎన్నికలో పాల్గొనమని ప్రకటించినట్లు సమాచారం. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వ్ అయింది. ఎంపీపీగా కొనసాగుతున్న వైసీపీకి చెందిన నాగమ్మ గతేడాది డిసెంబరులో మరణించారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. మిగిలిన తొమ్మిది మంది ఎంపీటీసీల్లో ముగ్గురు టీడీపీ సభ్యులు కాగా.. ఆరుగురు వైసీపీకి చెందిన వారు. టీడీపీ సభ్యుల్లో మహిళల్లేరు. ఇదివరకు ఉపఎన్నికకు మూడుసార్లు సమావేశం నిర్వహించగా కోరంలేక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో బుధవారం ఎన్నిక జరుగుతుందా, లేదా అనేది ప్రశ్నార్థకమే. ఎన్నికల అధికారి సంజీవయ్య, ఎంపీడీఓ గంగావతి, ఇన్‌చార్జి సీఐ రెడ్డప్ప, ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ ఎన్నికల ఏర్పాట్లను పూర్తి చేశారు. రెండు ప్లటూన్ల ఏపీఎస్పీ బలగాలు, 50 మందికిపైగా పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు.

‘శ్రీరామిరెడ్డి’ కార్మికుల సమ్మె విరమణ
‘శ్రీరామిరెడ్డి’ని మీరే చూసుకోండి: కలెక్టర్
4

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు

అనంతపురం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు ఎన్నో పోరాటాలతో సాధించుకున్న ప్రయోజనాలను ఒక్కొక్కటి రద్దు చేయడం ప్రభుత్వాల నిర్లక్ష్య, నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన 3 డీఆర్‌లు, 11వ పీఆర్‌సీ బకాయిలు, తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ చేయాలన్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి జయరామప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో గోప్యంగా ఆర్థిక బిల్లులో పొందుపరిచిన పెన్షన్ వ్యాలిడేషన్ సవరణ చాపకింద నీరులా పెన్షనర్లకు ఎంతో నష్టం కలిగించే అంశమన్నారు. ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్‌లు మాట్లాడుతూ కేంద్రంలో 8వ పేకమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. అనంతరం పెన్షనర్లందరూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజమోహన్, వెంకటనారాయణ, పెన్షనర్ల సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి రమణ, రామ్మృష్ణ, గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం తాలూకాల అధ్యక్ష కార్యదర్శులు, ప్రభుత్వ పెన్షనర్లు పాల్గొన్నారు.



ఓపిక ఉంటేనే..!
లేదంటే పెద్దాస్పత్రిలో వైద్యం కష్టం
(4లో..)

ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ వినోద్‌కుమార్



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతపురంరూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యే దృష్టి పెట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో 8 జాబ్ మేళాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్ మేళాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఈనెల 18న, రాప్తాడు నియోజకవర్గంలో 28న, అనంతపురం అర్బన్ పరిధిలో ఆగస్టు 1న, గుంతకల్లు నియోజకవర్గంలో ఆగస్టు 16న, రాయదుర్గంలో ఆగస్టు 29న, శింగనమలలో సెప్టెంబరు 12న, తాడిపత్రిలో సెప్టెంబరు 19న, ఉరవకొండలో సెప్టెంబరు 27న జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన క్యాలెండర్, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముకుంద, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, రూడ్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రణాళికలు తయారు చేయండి

గ్రామ సమగ్రాభివృద్ధిపై డీఆర్‌డీఏ పీడీ శైలజ

అనంతపురం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం పక్కాగా ప్రణాళికలు తయారు చేయాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ ఆదేశించారు. గ్రామ సమగ్రాభివృద్ధి స్థాపన ప్రణాళికలపై మంగళవారం నగర శివారు టీటీడీసీలో ఏపీఎంలు, సీసీలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సెర్ప్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల, గ్రామ స్థాయిల్లో నిర్దేశించిన సమయంలోగా శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పింఛన్, హౌసింగ్, ఇతర పథకాలకు అర్హులను గుర్తించాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భవనాలు అవసరమైతే ఆ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి, గ్రామ సమగ్రాభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి, అమలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం (ఫైనాన్స్) సత్యనారాయణ, డీపీఎం (జీవనోపాధులు) గంగాధర్, ప్రాజెక్టు మేనేజర్ ఐబీ (సంస్థాగత నిర్మాణం) రాధారాణి, డీపీఎం (పింఛన్లు) రాజ్యలక్ష్మి, డీపీఎం (బ్యాంక్ లింకేజ్) రవీంద్రబాబు, స్త్రీనిధి ఏజీఎం సాగర్, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శైలజ

ల్యాబ్ వద్ద యుద్ధమే..



రక్త పరీక్షల రిపోర్టుల కోసం నిరీక్షణ (మధ్యాహ్నం 3.07గంటలు)

ఓపీలో డాక్టరుకు చూపించుకుని, ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకుంటే రిపోర్టుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. రిపోర్టు వస్తేగాని డాక్టర్లు మందులు రాయడం లేదు. రిపోర్టులను మధ్యాహ్నం 3 గంటల తరువాత ఇస్తున్నారు. దీంతో ఉదయం ఆస్పత్రికి వచ్చిన రోగులు సాయంత్రం వరకూ అక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. రక్త పరీక్షలను స్త్రీ, పురుషులకు వేర్వేరుగా చేసినా, రిపోర్టులు ఒకేచోట ఇస్తున్నారు. దీంతో తోపులాట జరుగుతోంది. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అత్యవసరమైతే అంతే..



అత్యవసర విభాగంలో వీల్‌చైర్ కోసం మధ్యాహ్నం 12 గంటల నుంచి నిరీక్షిస్తున్న బాధితులు (సాయంత్రం 3.53 గంటలు)

అత్యవసర వైద్యం కోసం పెద్దాసుపత్రికి వస్తే ఉన్న ప్రాణాలు గాల్లో కలిసిపోవాల్సిందేనని బాధితులు వాపోతున్నారు. క్యాజువాల్టీలో తగినన్ని వీల్ చైర్లు, స్ట్రెచర్లు, మంచాలు అందుబాటులో లేవు. కదలలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను వెంటవచ్చినవారు మోసుకుపోవాల్సి వస్తోంది. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు ఉండాల్సి వస్తోంది. రోగులు వచ్చీరాగానే డాక్టర్లు స్కానింగ్‌కు రాస్తున్నారు. అవి చూస్తేగాని మందులు రాయడం లేదు. వార్డులకు పంపడం లేదు. స్కానింగ్‌కు వెళ్లేందుకు వీల్ చైర్‌లు, స్ట్రెచర్‌ల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

ఓపిక ఉంటేనే..!

లేదంటే పెద్దాస్పత్రిలో వైద్యం కష్టం

ఓపీలో కుదురుగా కూర్చోని వైద్యులు

గంటల తరబడి నిరీక్షిస్తున్న రోగులు

ల్యాబ్ రిపోర్టులకు యుద్ధం చేయాల్సిందే..!

క్యాజువాల్టీలో మంచానికి ఇద్దరు ముగ్గురు

అనంతపురం వైద్యం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పేదలకు పెద్ద దిక్కు అనంతపురం సర్వజన వైద్యశాల. ప్రైవేటు, కార్పొరేటు వైద్యుల వద్దకు వెళితే.. రూ.300 నుంచి రూ.500 వరకూ ఓపీ చార్జీలు వసూలు చేస్తారు. మందులకు ఎన్ని వేలు ఖర్చవుతుందో తెలియదు. ఇక అడ్మిషన్ చేసే పరిస్థితి ఉంటే పేద, మధ్యతరగతివారు అప్పులు చేయడమో, ఆస్తులు అమ్ముకోవడమో.. ఏదో ఒకటి జరుగుతుంది. అందుకే.. వేలాది మంది పెద్దాస్పత్రిని ఆశ్రయిస్తారు. రోజుకే సుమారు రెండు వేల మంది ఓపీకి వస్తారంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కానీ ఇక్కడి వైద్యులకు ఓపీలో కూర్చునే తీరిక ఉండదు. ఇలా వచ్చి.. అలా మాయమైపోతారు. తిరిగి వస్తారో రారో తెలియదు. రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిందే. అత్యవసర విభాగంలో వీల్‌చైర్‌లు, పడకల కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో పెద్దాస్పత్రిలో వైద్యం అందాలంటే.. రోగులకు చాలా ఓపిక ఉండాలి. వారికి సహాయంగా వచ్చే కుటుంబ సభ్యులు, మిత్రులకు సహనం తప్పనిసరిగా ఉండాలి. లేదంటే కుదరదంతే..!



మెరుపు తీగలు

ఆర్థోపెడిక్ స్త్రీ, పురుష ఓపీ వరండాలో కూర్చున్న బాధితులు (మధ్యాహ్నం 12.18 గంటలు)


పెద్దాస్పత్రిలోని పలు విభాగాలను ఆంధ్రజ్యోతి మంగళవారం విజిట్ చేసింది. మధ్యాహ్నం 12.14 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఓపీ, అత్యవస విభాగాల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం కళ్లకు కట్టింది. 'ఏ డాక్టరూ కుదురుగా ఉండటంలేదు. ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకుంటే రిపోర్టుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది' అని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వజన వైద్యశాలలో ఒకటి నుంచి 18 వరకు ఓపీ విభాగాలు ఉన్నాయి. జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, డెంటల్, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, సైకియాట్రీ, పీడియాట్రిక్, గైనిక్ తదితర విభాగాలవారు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ సేవలు అందించాలి. ఓపీలో డాక్టర్లకు విధులు కేటాయిస్తూ డ్యూటీ రోస్టర్ రూపొందిస్తున్నారు. వైద్యులు రోజూ దీన్ని పాటించాలి. కానీ పట్టించుకోవడం లేదు.



ఆర్థోపెడిక్ ఓపీలో పీఓపీ కోసం నిరీక్షిస్తున్న బాధితులు (మధ్యాహ్నం 2.52 గంటలు)



మానసిక జబ్బుల ఓపీ-18లో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ (మధ్యాహ్నం 12.50 గంటలు)



జనరల్ మెడిసన్ ఓపీ-2లో ఒకటో గదిలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ (మధ్యాహ్నం 12.43 గంటలు)

డాక్టర్లు వెళ్లిపోయారు..



మాది నార్పల మండలం గడ్డంనాగేపల్లి. ఆరోగ్యం బాగాలేదు. పెద్దాస్పత్రికి ఉదయం వచ్చి ఓపీ చీటీ తీసుకునేసరికి మధ్యాహ్నం 12.15 అయింది. ఈలోగా డాక్టర్లు వెళ్లిపోయారు. సాయంత్రం 3గంటలకు డాక్టర్లు వస్తారంట. చూపించుకుని బస్టాండ్‌కు వెళ్లేసరికి కనీసం 5 గంటలు అవుతుంది. ఊరికి వెళ్లడం ఇబ్బందిగా ఉంటుంది. ఏం చేస్తాం.. తప్పదు కదా..? డాక్టర్ వచ్చేదాకా ఇక్కడే ఉంటాను. - సరోజమ్మ

వీల్‌చైర్ లేదంట...



మాది కదిరి మండలం కరణంవారిపల్లె. మా ఆయనకు బాగాలేకుంటే కదిరికి వెళ్లాం. అక్కడ డాక్టర్లు అనంతపురం వెళ్లాలని సూచించడంతో ఇక్కడివచ్చాం. డాక్టర్లు స్కానింగ్ రాసిచ్చారు. వీల్‌చైర్ కోసం మూడు గంటల నుంచి చూస్తున్నాం. తొందరగా స్కానింగ్ చేయిస్తే దాన్నిబట్టి వార్డుకు పంపుతారంట. బాగుంటే మందులిస్తారంట. బెడ్లుకూడా లేవు. - ప్రమీల, కదిరి

ఓపీలో ఉండాల్సిందే...



డ్యూటీ రోస్టర్ మేరకు ప్రతి ఒక్కరూ ఓపీలో ఉండాల్సిందే. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు ఓపీ సేవలు అందిస్తున్నాం. నిర్దేశిత సమయంలో ఓపీలో లేని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. అత్యవసర విభాగంలో కూడా డ్యూటీ రోస్టర్ ప్రకారం డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది ఉండాలి. తాకిడి ఎక్కువైతే తగిన చర్యలు తీసుకోవాలి. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, బెడ్ల కొరత నిజమే. అందుకే రోగులు నిరీక్షించాల్సి వస్తోంది. - డాక్టర్ ఆత్మారాం, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్

భారీ స్కోర్ దిశగా కడప, నెల్లూరు జట్లు



ఫర్హాద్‌ఖాద్రి



భరత్



వంశీకృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మల్టీ డే క్రికెట్ పోటీల్లో కడప, నెల్లూరు జట్లు భారీ స్కోర్ దిశగా సాగుతున్నాయి. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు మంగళవారం రెండో రోజు స్థానిక అనంత క్రీడా గ్రామంలో కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 237పరుగులకు ఆలౌట్ కాగా, అనంతపురం 242 పరుగులకు కుప్పకూలింది. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన నెల్లూరు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. బ్యాటర్ ఫర్హాద్ ఖాద్రి 111పరుగులు, రోషన్ పవన్‌కుమార్ 71పరుగులు సాధించారు. మరో పోటీ కర్నూలు-కడప జట్ల మధ్య జరిగింది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 210పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన కడప తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 117 పరుగులు సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 8వికెట్లు కోల్పోయి 393 పరుగులు సాధించింది. బ్యాటర్ వంశీకృష్ణ 157పరుగులు, ఆరీఫ్ హుస్సేన్ 92పరుగులు సాధించారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య



మల్లప్ప(ఫైల్)

ధర్మవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో రైలు కిందపడి ముగ్గురు మృతి చెందారు. ధర్మవరం సాయినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు మల్లప్ప(53) అప్పుల బాధతో పోతుకుంట బ్రిడ్జి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రైల్వేహెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. మల్లప్ప రెండు మగ్గాలు ఏర్పాటు చేసుకుని భార్య ప్రమీలతో కలిసి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. చేనేతలో గిట్టుబాటు ధరలు లభించకపోవడం, కుటుంబ అసరాల దృష్ట్యా అప్పులు చేశాడు. వీటిని తీర్చే మార్గం కానరాక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

- పెనుకొండ రూరల్: మండలంలోని పుట్టపర్తికి వెళ్లే మార్గంలో రైలు కింద పడి హనుమప్పల్లి గ్రామానికి గంగాద్రి(37) ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ సజ్జప్ప మంగళవారం తెలిపారు. గంగాద్రి కొన్నేళ్లుగా సోమందేపల్లిలో నివాసముంటూ మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రెండ్రోజుల కిందట మొహర్రం కోసం సొంతూరికి వచ్చాడు. ఈయన ఊర్లో గతంలో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈక్రమంలో రుణం తీర్చమని వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి భార్య భువనేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నట్లు తెలిపారు.
- డి.హీరేహాళ్: మండలంలోని హడగలి గ్రామ సమీపంలో కెంచప్పకొండ దగ్గర రైల్వేట్రాక్‌పై సోమవారం రాత్రి రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని శవం పడి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి రైల్వే పోలీసులకు విషయాన్ని వివరించారు. రైల్వేట్రాక్‌పై సుమారు 40 సంవత్సరాలు వయస్సు గల వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని గుంతకల్లు రైల్వే పోలీసులు తీసుకెళ్లారు. మృతుడి వివరాలు తెలిస్తే తమకు తమకు సమాచారం అందించాలని స్థానికులను వారు కోరారు.

స్కూల్ గ్రాంట్.. గుటుక్కు..!

(3వ పేజీ తరువాయి)

బోధనకు సంబంధించి టీఎల్‌ఎం మెటీరియల్ అందుబాటులో ఉంచాలి. కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రతి పాఠశాలకు ఈ గ్రాంట్‌తో అవసరమైన టీఎల్‌ఎం మెటీరియల్ ఏర్పాటుకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇవేవీ చేయకుండా అన్నీ చేసినట్లు మాయచేసి వచ్చిన రూ.లక్షను సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డ్రా చేసేశారు. ఇప్పుడు పాఠశాలలో ఏదైనా కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశిస్తే.. పైసాలేదని హెచ్‌ఎంలే చెబుతుండడం శోచనీయం.



సమగ్రశిక్ష కార్యాలయం

బోగస్ ఓచర్లతో స్వాహా

కాంప్లెక్స్ నిధుల విషయంలో అడిగేవారేలేరని సంబంధిత హెచ్‌ఎంలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో డబ్బు పడితే వెంటనే కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డ్రా చేసేసుకున్నారు. రెండు మీటింగ్‌లు జరగ్గా.. ఆ మొత్తం సొమ్ము ఖర్చయినట్లు చూపిస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ నిధులపై సోషల్ ఆడిట్ చేయడానికి రాష్ట్రశాఖ నుంచి వచ్చిన ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధులు వచ్చారు. ఆ సమయంలో కాంప్లెక్స్ నిధులు ఫలానాదానికి ఖర్చు పెట్టామంటూ బోగస్ ఓచర్లతో ఓకే చేయించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీఎల్‌ఎం ఇవ్వకుండా, కనీసం నెలకు 10 నుంచి 15 పాఠశాలలను తనిఖీ చేయకుండా, మీటింగ్‌లకు పైసా ఖర్చుపెట్టకుండానే బోగస్ ఓచర్లతో ఆడిట్ సమయంలో కొంతడబ్బు ముట్టజెప్పి ఆమోదం వేయించుకున్నారని హెచ్‌ఎంలే అంటున్నారు. ఇటీవల బదిలీలు జరిగాయి. దాదాపు 70శాతం మంది కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఇతర మండలాల పాఠశాలలకు వెళ్లిపోయారు. బదిలీలపై వెళ్లిపోతున్నామని బరితెగించి మరీ.. స్కూల్ గ్రాంట్‌ను స్వాహా చేశారు. ఆ కాంప్లెక్స్ స్కూల్‌కు వెళ్లిన కొత్త హెచ్‌ఎంలకు పాత వారు చార్జి ఇవ్వాల్సి ఉంటుంది. నిధులు పైసాలేవని చూపుతుండడంతో కొత్త హెచ్‌ఎంలు అవాక్కవుతున్నారు. కొందరు కొత్త హెచ్‌ఎంలు.. ఖర్చు పెట్టినట్లు చూపుతున్న మేరకు ఆధారాలు చూపితేనే ఎల్‌పీసీ ఇస్తామని మెలిక పెడుతున్నారు. దీంతో కొన్నిచోట్ల కొత్త, పాత హెచ్‌ఎంల మధ్య గొడవలు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా తమకేమీ సంబంధం లేదన్నట్లు విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు మౌనంగా ఉండడం శోచనీయమని ఉపాధ్యాయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

గ్రాంట్ విడుదల ఏపీసీ ద్వారానే..

ప్రసాద్‌బాబు, డీఈఓ



పాఠశాలలు, టీచర్లకు గ్రాంట్ సమగ్రశిక్ష ఏపీసీ మంజూరు చేస్తుంటారు. కాంప్లెక్స్ నిధులు కూడా అంతే. ఖర్చు వివరాలు కూడా సమగ్రశిక్ష అధికారులే పర్యవేక్షిస్తారు.

సమావేశాలు పెట్టి.. లెక్కలు తేలుస్తాం

శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష



పాఠశాల నిధులను నిబంధనల మేరకు ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. జిల్లాలోని 135 కాంప్లెక్స్‌లకు రూ.లక్ష చొప్పున ఇచ్చాం. రెండు సమావేశాలకే మొత్తం ఖర్చయిపోయిందనడం విచిత్రమే. దీనిపై త్వరలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేస్తాం. నిధుల ఖర్చుకు సంబంధించిన యుటిలైజేషన్ బిల్లులు తీసుకుని పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ఉందంటే అలాంటి వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకుంటాం.

19న జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థుల సమావేశం



పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు వీసీ సుదర్శన్‌రావు తెలిపారు. సమావేశానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయన రిజిస్ట్రార్ కృష్ణయ్య తో కలిసి ఆవిష్కరించారు. కళాశాల పూర్వ విద్యార్థులు సమావేశంలో పాల్గొని తమ అనుభవం, జ్ఞానం, ఇతరత్ర విషయాలను పంచుకోవాల న్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కళాశాల అల్యూమినీ అసోసియేషన్ సెక్రటరీ శోభా బిందు, అనేక అనంతపురం చాప్టర్ ఉపాధ్యక్షుడు విశ్రాంత ఆచార్యులు శంకర్, యూనివర్సిటీ పీఆర్‌ఓ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతికి నివాళి

జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఔట్‌స్సోరింగ్ ఉద్యోగి భూమిరెడ్డి శివారెడ్డి మంగళవారం మృతి చెందాడు. ఈసందర్భంగా సంతాప సభ నిర్వహించారు. వీసీ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు శివారెడ్డి మృతికి సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె విరమణ



శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం మోటార్లను ఆన్ చేస్తున్న ఓబులు

కూడేరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు మంగళవారం సమ్మె విరమించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు పీఏబీఆర్ డ్యాంలోని మోటార్లను ఆన్ చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు వేతనాలు, పీఎఫ్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని సమ్మెబాట పట్టిన విషయం తెలిసిందే. కార్మికులు వంద రోజులుగా సమ్మె చేస్తుండటంతో స్పందించిన ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేసింది. దీంతో కార్మికులు వేతనాలు తదితర డిమాండ్లను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు. ప్రజల మద్దతుతోనే కార్మికుల సమ్మెను వందరోజులు చేశామని ఓబులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నాగేంద్రకుమార్, ఎర్రిస్వామి, రాము, వన్నూరస్వామి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆ పథకాన్ని మీరే చూసుకోండి

- **ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కలెక్టర్ ఆదేశం**

అనంతపురం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అమలును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అమలుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో ఇతర తాగునీటి పథకాలతో పాటు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అమలును కూడా ఏఈలు పర్యవేక్షించాలన్నారు. ఈ తాగునీటి పథకానికి సంబంధించిన రూ.3.83కోట్లు ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కాంట్రాక్టర్ అకౌంట్‌లోకి ప్రభుత్వం జమ చేశారన్నారు. ఈ నిధులను కార్మికులకు ఇప్పించి, సమ్మెలో ఉన్న వారిని వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంప్ హౌస్‌లో, పైపులైన్లలో నీళ్ల లేకపోతే అవి పగిలిపోయే అవకాశాలున్నాయని, పైపులు పగిలిపోతే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేస్తామన్నారు. పంప్‌హౌస్‌లలో సీసీ కెమెరాలను వచ్చే శనివారానికి ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్, డీఈలు శిరీష, శ్రీనివాస్, ఏఈలు సురేంద్రప్రసాద్, శ్రీనివాసకుమార్, శివకృష్ణ, హరికృష్ణ నాయక్, ధనుంజయ్, ఎస్‌ఈ పీఏ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆముదమే మేలు


- **కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు**



చంద్రాయుడు

అనంతపురం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వర్షాధారం, రబీ సీజన్‌లో బోరుబావుల కింద ఆముదం పంటను సాగు చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు ఒక ప్రకటనలో సూచించారు. ఖరీఫ్‌లో వర్షాధారం కింద ఆగస్టు నెలాఖరు దాకా ఆముదం పంటను సాగు చేసుకోవచ్చన్నారు. బోరు బావుల కింద అక్టోబరు నెల వరకు విత్తుకోవచ్చని తెలిపారు. ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. విత్తన ఖర్చు ఎకరాకు రూ.700 నుంచి రూ.1000ల వరకు ఆముదం రకాన్ని బట్టి ఉంటుందన్నారు. నేల స్వభావం ఆధారంగా 15 నుంచి 25 రోజుల మధ్య తడి ఇవ్వాలన్నారు. ఆముదం పంటకు సోకే చీడపీడలను మందులతో సులభమైన పద్ధతిలో నివారించ వచ్చని తెలిపారు. వేరుశనగతో పోలిస్తే ఆముదం పంట సాగు ఖర్చు తక్కువన్నారు. అనిశ్చిత, తక్కువ వర్షపాతం ఉన్న సమయంలో వేరుశనగ దిగుబడి తగ్గి నష్టం తీవ్రంగా ఉంటుందన్నారు. ఆముదం పంటలో గెలలు తరచుగా ఒకదాని తర్వాత ఒకటి రావడం ద్వారా కనీస దిగుబడి దక్కే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, ఆముదం పంటను సాగు చేసుకొని, లాభాలు పొందాలని సూచించారు.

టీపీఆర్ ట్రస్ట్ అధినేత మృతి



తలారి పరశురాముడు (ఫైల్)

గుంతకల్లు టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అంతవరకు ఆనందంగా డ్యాన్స్ చేసిన వ్యక్తి ఉన్నఫలంగా మృతిచెందిన సంఘటన మంగళవారం ఉదయం నార్పల మండలం గూగూడులో జరిగింది. గుంతకల్లుకు చెందిన టీపీఆర్ ట్రస్ట్ అధినేత తలారి పరశురాముడు(53) మంగళ వారం గుండె పోటుతో మృతి చెందాడు. పరశురాముడి కుమారుడు రామ్‌చరణ్‌తేజ్ గూగూడు కుళ్లాయస్వామి దేవాలయంలో జరిగే కందురి కార్యక్రమానికి కుటుంబ సమేతంగా సోమవారం సాయంత్రం వెళ్లారు. మరుసటి రోజు ఉదయం 10 గంటలకు పరశురాముడు కొద్ది సేపు డ్యాన్స్ చేసి కూర్చున్నాడు. తర్వాత కొద్దిసేపటికే ఉన్నఫలంగా కుప్పకూలి పోయాడు. కుటుంబసభ్యులు వెంటనే నార్పల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. తలారి పరశురాముడు టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశాడు. 2014లో సమైక్య ఆంధ్ర పార్టీ తరపున గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. తరువాత టీపీఆర్ ట్రస్ట్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు. పరశురాముడుకు భార్య తలారి శకుంతలమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. పరశురాముడు మృత దేహానికి ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బొలెరో ఢీకొని వ్యాపారి మృతి

కదిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరి-మదనపల్లి రోడ్డులో మిస్టర్ టీ దుకాణం ఎదురుగా మంగళవారం బొలెరో వాహనం ఢీకొని వ్యాపారి గంగన్న (56) మరణించాడు. సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడపాల వీధికి చెందిన గంగన్న ద్విచక్రవాహనంలో చింతపండు తీసుకెళ్లి, విక్రయిస్తుండేవాడు. అందులో భాగంగా మంగళవారం కదిరి-మదనపల్లి రోడ్డులోని మిస్టర్ టీ దుకాణం ఎదురుగా వాహనం బైక్ నిలిపి, అక్కడే కూర్చున్నాడు. అతివేగంతో వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగన్నను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మృతిచెందినట్లు సీఐ తెలిపారు. గంగన్న భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. బొలెరో వాహన డ్రైవర్ షేక్ షాహీర్‌బాషాపై కేసు నమోదు చేశామన్నారు. గంగన్నకు పిల్లలు లేరు.

పోస్టుమార్టం ఆలస్యం.. బంధువుల ఆందోళన



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

గంగన్న మృతదేహానికి పోస్టుమార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ అతడి బంధువులు.. ఆస్పత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. పోలీసులు రిపోర్టు ఇవ్వకుండానే తాము పోస్టుమార్టం చేయలేమని వైద్యులు చెప్పారు. పోస్టుమార్టం చేసేలోపే రిపోర్టు ఇచ్చామని పోలీసులు చెప్పారు. మొత్తంమీద పోస్టుమార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారని మృతుని బంధువులు ఆవేదన చెందారు.

ఈజీగా.. కొట్టుకెళ్లారు..!



రామాంజులమ్మ

నల్లమాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లాలంటే దుండగులు పెద్ద పథకమే వేస్తారు. చాలా రిస్కే తీసుకుంటారు. నడుచుకుంటూ వెళ్తున్న, ఇళ్లు, దుకాణాల్లో ఉన్న మహిళల మెడలోని గొలుసును అకస్మాత్తుగా లాగేస్తుంటారు. ఒక్కోసారి గొలుసును మహిళలు గట్టిగా పట్టుకుంటే బైక్‌లోని దుండగులు కిందపడిపోయిన సందర్భాలున్నాయి. అలా.. పోలీసులకు కూడా దొరికిపోయారు. మరికొందరు గాయాలపాలయ్యారు కూడా. నల్లమాడలో మాత్రం చాలా ఈజీగా గొలుసు కొట్టుకెళ్లారు దొంగలు. మండలకేంద్రంలోని గ్రామీణ బ్యాంకు పక్కన సుధాకర్‌రెడ్డి ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఆయన భార్య రామాంజులమ్మ షాపులో ఉన్నారు. ఆ సమయంలో ఇద్దరు దుండగులు షాపు వద్దకొచ్చారు. గమ్ కావాలని అడగ్గా.. ఆమె ఇచ్చారు. దుండగులు రూ.వంద నోటు ఇచ్చారు. ఆమె చిల్లర ఇస్తుండగా.. 'పెద్దమ్మా.. నీ మెడలోని బంగారు గొలుసు ఇలా ఇవ్వు.. చూసి.. ఇస్తామన్నా'రు. ఆమె గొలుసు ఇచ్చేశారు. ఓ పేపర్ ఇవ్వమనగా.. ఆమె ఇచ్చారు. చిల్లర ఇస్తుండగా.. దుండగులు పరుగెత్తుకుంటూ వెళ్లిపోయారు. దీంతో రామాంజులమ్మ లబోదిబోమంటూ విషయం భర్త సుధాకర్ రెడ్డికి చెప్పింది. అతడు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ కార్యకర్తపై కేసు

బత్తలపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బండి కిష్టప్పపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి శ్రద్ధాంజలితో కూడిన ఫొటోను బండి కిష్టప్ప తన మొబైల్‌లో వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఇది గమనించిన టీడీపీ నాయకులు కాకర్ల సురేంద్రనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి అదృశ్యం



దేవభూషణ్

కణేకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో గల గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి దేవభూషణ్ సోమవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. కళ్యాణదుర్గం నియోజకవర్గం పిల్లలమర్రి గ్రామానికి చెందిన హనుమప్ప కుమారుడైన దేవభూషణ్ సోమవారం రాత్రి పాఠశాల హాస్టల్ నుంచి కనిపించకుండా పోయాడు. ఉపాధ్యాయులు ఈ విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎద్దు పొడవడంతో రైతు మృతి

రొద్దం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రైతు బండి వెంకటప్ప(70)ను ఎద్దు పొడవడంతో మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు వెంకటప్ప మంగళవారం ఉదయం 11గంటలకు ఇంటి పక్కనే ఉన్న పొలంలో ఎద్దును పట్టుకునేందుకు వెళ్లాడు. అది పొడవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి అతడి తల తగిలింది. దీంతో అక్కడే కుప్పకూలిపోయాడు. బంధువులు పరిశీలించి, మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఎస్ఐ నరేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించిం, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండకు తరలించారు.

హోదాలు మారాయ్..

భూసంరక్షణ విభాగంలో మార్పులు

జిల్లాకు ఈఈ, డీఈఈ పోస్టులు మంజూరు

అనంతపురం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): భూసంరక్షణా విభాగ అధికారుల హోదాను ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు భూసంరక్షణ విభాగంలో వ్యవసాయాధికారి (ఏఓ), వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ), వ్యవసాయ ఉప సంచాలకుడు (డీడీఏ), వ్యవసాయ సంయుక్త సంచాలకుడు (జేడీఏ) హోదా అధికారులు ఉండేవారు. ఏఓను ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, ఏడీఏను డీఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, డీడీఏను ఈఈ(ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, జేడీఏను ఎస్ఈ(సూపరింటెండెంట్ ఇంజనీర్)గా హోదాలు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాకు ఒక్కో ఈఈ, డీఈఈ పోస్టులను కేటాయించింది.

గండం.. గట్టెక్కించారు..!



నాగేపల్లి వద్ద పూర్తయిన బ్రిడ్జి

పూర్తయిన హెచ్చెల్సీ మరమ్మతులు

నీటి సరఫరాకు మార్గం సుగమం

గండ్ల భయానికి స్వస్తి

కణేకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి లోనైన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)పై కూటమి ప్రభుత్వ శ్రద్ధ పెట్టింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులను పూర్తి చేసింది. రూ.35 కోట్ల వ్యయంతో కణేకల్లు హెచ్చెల్సీ పరిధిలో పలు పనులను పూర్తి చేసి, నీటి సరఫరాకు మార్గం సుగమం చేశారు. గత వైసీపీ పాలకులు కాలువ ఆధునికీకరణ కోసం రూపాయి కూడా ఖర్చు చేసిన పాపాన పోలేదు. చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో హెచ్చెల్సీకి పలుసార్లు గండ్లు పడి, నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి.

కూటమి పాలనలో పూర్వ వైభవం

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హెచ్చెల్సీపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హెచ్చెల్సీ మరమ్మత్తుల కోసం నిధులు సాధించడంలో సఫలీకృతులయ్యారు. డీ.హీరేహాళ్ మండలంలోని మల్లికేతి బ్రిడ్జికి రూ.1.20 కోట్లు, నాగలాపురం బ్రిడ్జికి రూ.1.60 కోట్లు, బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు బ్రిడ్జికి రూ.1.60 కోట్లు, కణేకల్లు మండలంలోని నాగేపల్లి బ్రిడ్జికి రూ.1.47 కోట్లు, యర్రగుంట వద్ద ఉన్న యూటీకి రూ.4.10 కోట్లు ఇక 115 కి.మీ. నుంచి 136 కి.మీ. వరకు లైనింగ్ పనులకు దాదాపు రూ.7.42 కోట్లు నిధులను కేటాయించారు. ఆ మేరకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. దీంతో నీటి సరఫరాకు ఢోకా లేకుండా పోయింది. ప్రధానంగా యూటీల వద్ద లైనింగ్ సక్రమంగా లేనిచోట గతంలో పలుసార్లు గండ్లు పడి రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అలాంటి చోట్ల పనులు పూర్తవడంతో రైతులకు ఇబ్బంది లేకుండా ఉండవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. కూలిపోయిన బ్రిడ్జి స్థానంలో నూతనంగా నిర్మించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేయడంతో కాలువకు పూర్వ వైభవం వచ్చింది.

> హెచ్చెల్సీకి నీరు వదులుతున్నారంటే అందరూ సంతోషపడాలి. గత ఐదేళ్లూ భయపడేవారు. ఎక్కడ గండ్లు పడతాయో, కాలువ తెగిపోతుందోనని ఆందోళన చెందేవారు. అధికారుల్లో ఒకటే టెన్షన్. కాలువ సామర్థ్యం కన్నా చాలా తక్కువ మొత్తంలో నీటిని ప్రవహించేవారు. అయినా, గండ్లు పడేవి. నీటి సరఫరాను ఆపి, మరమ్మతులు చేయాల్సి వచ్చేది. గండ్లు పడిన చోట నీరు పొలాలను ముంచెత్తేది. దీంతో రైతులు నష్టపోయేవారు. ఇలా.. ఐదేళ్లూ భయం.. భయంగా.. సాగిపోయింది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే అందుకు కారణం. ఐదేళ్లూ కాలువ మరమ్మతులు చేపట్టలేదు. పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో ఏటా గండ్ల బెడద తప్పేదికాదు. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే కాలువ మరమ్మతులు చేపట్టింది. పనులు పూర్తవడంతో నిరాటంకంగా నీరు సరఫరా కానుంది. దీంతో అన్నదాతలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా మరమ్మతులు చేశారు



ఈ ఏడాది హెచ్చెల్సీ మరమ్మతులు చేస్తారని ఊహించలేదు. చాలా వేగవంతంగా పనులు పూర్తి చేయడం హర్షణీయం. కాలువ పటిష్ఠతకు మరిన్ని పనులు చేపట్టాలి.

- ఖలీద్, రైతు, కణేకల్లు

రైతులకు ఎంతో ఉపయోగకరం



హెచ్చెల్సీ మరమ్మతులు ఆయకట్టు రైతులకు ఎంతో ఉపయోగకరం. గతంలో కాలువ పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో పదేపదే గండ్లు పడి, నీటి సరఫరా నిలిచిపోయేది. మరమ్మత్తులు చేయడంతో అలాంటి పరిస్థితి ఉండకపోవచ్చని ఆశిస్తున్నాం.

- నాగభూషణం, రైతు, గంగలాపురం

80 శాతం పనులు పూర్తి చేశాం

హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల పరిధిలో దాదాపు 80 శాతం హెచ్చెల్సీ మరమ్మతులు పూర్తి చేశాం. యుద్ధప్రాతిపదికన యూటీ, బ్రిడ్జి, లైనింగ్ పనులు పూర్తి చేశాం. కణేకల్లు ఔట్‌ఫాల్ రెగ్యులేటర్, బిదురకుంతం బ్రిడ్జి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఉండవు.

- దివాకర్, హెచ్చెల్సీ డీఈ, కణేకల్లు

అనంత క్రికెటర్లపై కాసుల వర్షం

ఏపీఎల్ వేలంలో భారీ ధరలు

అత్యధికంగా గిరినాథ్‌రెడ్డికి రూ.10.05 లక్షలు

11మంది జిల్లా క్రీడాకారులకు అవకాశం



గిరినాథ్‌రెడ్డి, వినయ్‌కుమార్, వీరారెడ్డి



ప్రశాంత్, అర్జున్ టెండూల్కర్, మల్లికార్జున, సంతోష్



దత్తారెడ్డి, కమిల్, దీపక్, మనోజ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన క్రికెటర్లపై కాసుల వర్షం కురిసింది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2025లో జిల్లా వాసులకు భారీ ధరలు దక్కాయి. ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నంలో ఏపీఎల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 14న ఆటగాళ్ల వేలం విశాఖపట్నంలో నిర్వహించారు. ఆయా ఫ్రాంచైజీలు.. జిల్లా క్రికెటర్ల కోసం భారీగానే వెచ్చించాయి. జిల్లాకి చెందిన గిరినాథ్‌రెడ్డిని రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు రూ.10.05 లక్షలకు కొనుగోలు చేసింది. వినయ్‌కుమార్ కోసం అమరావతి రాయల్స్ జట్టు రూ.7.5లక్షలు వెచ్చించింది. వీరారెడ్డిని రూ.4.20లక్షలకి సింహాద్రి వైజాగ్ జట్టు, డీబీ ప్రశాంత్‌కుమార్‌ను రూ.2.20లక్షలకి తుంగభద్ర లయన్స్, అర్జున్ టెండూల్కర్‌ను రూ.1.2లక్షలకి కాకినాడ కింగ్స్, మల్లికార్జునను రూ.90వేలకి అమరావతి, సంతోష్‌ను రూ.60వేలకు అమరావతి రాయల్స్, దత్తారెడ్డిని రూ.60వేలకు తుంగభద్ర లయన్స్, కమిల్‌ను రూ.50వేలకి సింహాద్రి వైజాగ్, దీపక్‌ను రూ.30వేలకి తుంగభద్ర లయన్స్, మనోజ్‌ను రూ.30వేలకి రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్లు కొనుగోలు చేశాయి. ఈ సీజన్‌కు మాత్రమే కాంట్రాక్టు వర్తించనుంది.

అవగాహన పెంచుకోవాలి

పంచాయతీ పురోగతి సూచిక 2.0పై శిక్షణలో జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక 2.0పై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జడ్పీ సీఈఓ శివశంకర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రంలోని సమావేశ భవనంలో శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన ఎంపీడీఓలు, ప్రతి మండలం నుంచి ఒక పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌కు మంగళవారం శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. పంచాయతీ పురోగతి సూచిక 2.0 కింద చేపట్టాల్సిన అంశాలను వివరించారు.

నిప్పుల గుండంలో నమాజ్



అగ్నిగుండంలో నమాజ్ చేస్తున్న షఫీ

ఉరవకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం చూస్తుంటాం. అగ్నిగుండంలోకి దిగి వచ్చేస్తుంటారు. ఉరవకొండలో నిప్పుల గుండంలో ఏకంగా నమాజ్ చేశారు. కణకణలాడే నిప్పులపై కూర్చుని నమాజ్ చేయడాన్ని చూసిన భక్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు. పట్టణంలోని 10వ వార్డులో గల హుసేన్, హుసేన్ పీర్ల చావిడిలో చిన్న పీర్ల పండుగ నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత నిర్వాహకుడు షఫీ అగ్నిగుండంలోకి దిగాడు. నిప్పులపై రుమాలు పరచుకుని, దానిపై కూర్చుని నమాజ్ చేశారు. తర్వాత సాయి కూడా అదే తరహాలో అగ్నిగుండంలో నమాజ్ చేశారు. భక్తులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొన్నేళ్లుగా ఈ ఆచారం కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

కనగానపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీఎఫ్ జవాన్ కె. మురళి అంత్యక్రియలు మంగళవారం అతడి స్వగ్రామం శివపురం గ్రామంలో జరిగాయి. సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శ్రీరాములు, ఇతర అధికారులు జవాన్ పార్థివ దేహం ఉన్న శవపేటికను అతడి భార్య, తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం శవపేటికపై జాతీయజెండాను ఉంచి గౌరవ వందనం చేశారు. మురళికి సంబంధించిన పలు రికార్డులు, నగదును అధికారులు అప్పగించారు. అనంతరం కుటుంబికులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున అంత్యక్రియల్లో పాల్గొని జవాన్ మురళికి కడసారి వీడ్కోలు పలికారు.



మురళి పార్థివ దేహంపై జాతీయ జెండాను కప్పుతున్న అధికారులు

నాన్న లేస్తాడు లేమ్మా..!

'ఏడవొద్దమ్మా..! వీళ్లందరూ వెళ్లిపోతే నాన్న లేస్తాడులేమ్మా' అని జవాన్ మురళి నాలుగేళ్ల కుమారుడు తారక్‌రామ్ తన తల్లితో అనడం అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించింది. మురళి శవపేటికపై పడి భార్య పావని ఏడుస్తుంటే నాలుగేళ్ల చిన్నారి అమాయకంగా అందరివైపు చూస్తూ తల్లితో అన్నమాటలకు అక్కడున్న వారందరూ ఒక్కసారిగా బోరున విలపించారు.

అండగా ఉంటాం: ఎమ్మెల్యే పరిటాల సునీత

సీఆర్‌పీఎఫ్ జవాన్ కుటుంబానికి అండగా ఉంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభయమిచ్చారు. మురళి పార్థివ దేహం వద్ద ఆమె నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేశసేవకుడు ఇలా మరణించడం బాధాకరమన్నారు. మురళి కుటుంబానికి పరిటాల కుటుంబం అండగా ఉంటుందని రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మురళి భార్య, తల్లిదండ్రులకు అనంతపురంలో వేర్వేరుగా రెండు సెంట్ల స్థలం. చెల్లెలు అంజలీకి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట డీసీఎంస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సుధాకర్ చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య ఉన్నారు.

వానొస్తుందంట..!

రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

బుక్కరాయసముద్రం, జూలై15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 34.8 నుంచి 35.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావచ్చన్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.6-24.3 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చని తెలిపారు. నైరుతి దిశగా గాలులు గంటకు 13-14 కి.మీ వేగంతో వీచే అవకాశము ఉంటుందని, గాలిలో తేమ ఉదయం పూట 68-73 శాతం, మధ్యాహ్నం 41-67 శాతం నమోదు కావచ్చన్నారు. అనంతపురం జిల్లాలో బుధవారం 2 మి.మీ, 17న 5 మి.మీ, 18న 25 మి.మీ 19న 15 మి.మీ, 20న 10 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో బుధవారం 2 మి.మీ, 17న 5 మి.మీ, 18న 28 మి.మీ 19న 13 మి.మీ, 20న 15 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

కంది విత్తుకోవచ్చు

రానున్న ఐదు రోజులకు వర్ష సూచన ఉన్నందున కంది పంటను జూలై రెండో పక్షం వరకు విత్తుకోవచ్చన్నారు. ముందుగ విత్తిన కందిలో ఒత్తుగా ఉన్న మొక్కలను పలుచన చేయాలి. మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీ దూరం ఉండేలా చూసుకోవాలి. నీటి పారుదల కింద సాగు చేసిన వేరుశనగ పూత దశలో ఉంది. రైతుల ఎకరాకు 200 కిలోల జిప్సం ఎరువును ఈ దశలో వేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు ముందుగా విత్తిన వేరుశనగలో మొదలు కుళ్లు, రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు కార్బండిజిం మాంకోజెబ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదలు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు.

ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నరేంద్రకుమార్



గోరంట్ల, జూలై15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంపీడీఓ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా గోరంట్ల ఎంపీడీఓ నరేంద్రకుమార్ ఎన్నికయ్యారు. అనంతపురంలోని జడ్పీ భవనంలో శ్రీసత్యసాయి జిల్లా ఎంపీడీఓల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా ధర్మవరం ఎంపీడీఓ సాయిమనోహర్, ప్రధాన కార్యదర్శిగా పెనుకొండ నరేష్‌కృష్ణ, సహాయ కార్యదర్శిగా తలుపుల నసీమా, కోశాధికారిగా నల్లచెరువు రఘునాథ్‌గుప్త, కార్యవర్గ సభ్యులుగా అమరాపురం రామారావు, బుక్కపట్నం శ్రీనివాసులు, నీకేపల్లి బాలకృష్ణుడు ఎన్నికైనట్లు ప్రకటించారు.

బీటెక్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలో జూన్‌లో నిర్వహించిన బీటెక్ మొదటి, రెండో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. బీటెక్ ఒకటి , రెండో సెమిస్టర్(ఆర్23), సప్లిమెంటరీ(ఆర్20), (ఆర్19),(ఆర్15) ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్ నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శివకుమార్ ప్రకటించారు. బీటెక్ మొదటి సెమిస్టర్ ఆర్23, ఆర్20, ఆర్19, ఆర్15 సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ కంట్రోలర్ శంకర్‌శేఖర్‌రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి పాలిసెట్ తుది విడత కౌన్సెలింగ్

అనంతపురంరూరల్, జూలై15(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ తుది కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 17వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 17 నుంచి 19వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 20వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్ల నమోదు చేస్తారన్నారు. ఈనెల 21న సీట్ల కేటాయింపు, పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ కావడానికి 24 నుంచి 26వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు.

19న స్పాట్ అడ్మిషన్లు

జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిపోయిన ఐవీసీ సీట్ల కోసం ఈనెల 19న స్పాట్ అడ్మిషన్లు అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తిగత అభ్యర్థులు దరఖాస్తులను అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 18వ తేదీలోగా అందజేయాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు.

బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోండి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల, గ్రామ స్థాయి అధికారులు ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన పంచాయతీ సెక్టార్, జీరో పావర్టీ పీ4 తదితర అంశాలపై డ్వామా పీడీ, జడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్డీఓ, డీఎల్డీఓలు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీ-4 కార్యక్రమం కింద జిల్లాలో 54వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం మార్గదర్శకుల గుర్తింపు వేగంగా చేపట్టాలన్నారు. ప్రతి రోజు 3వేల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. ప్రతి మండలం నుంచి వంద మంది, మున్సిపాలిటీ నుంచి 200 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్ చైల్డ్ ఈకేవైసీ పెండింగ్, గ్రీవెన్స్ పెండింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ వందశాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

19న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

ఈనెల 19న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించి ప్రజలందరికీ తెలిసే విధంగా శుక్రవారం టాంటాం వేయించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై దృష్టి సారించాలన్నారు. క్లాత్ బ్యాగులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీసీలో డీపీఓ నాగరాజునాయుడు, సీపీఓ అశోక్‌కుమార్, జెడ్పీ సీఈఓ శివశంకర్, ఆధార్ నోడల్ అధికారి నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



శాకంబరి అలంకరణలో వాసవీమాత, మల్లాలమ్మ దేవి

శాకంబరీ.. పాహిమాం..!

అనంతపురం టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ పంచమిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యానగర్‌లోని మల్లాలమ్మ ఆలయంలో అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలేపల్లి నాగరాజు, ఆలయ ట్రస్టు అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

గుల్జార్‌పేటలోని కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత మూలవిరాట్‌కు కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి శాకాంబరి మాతగా పూజించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు హాజరై సామూహికంగా పూజలు చేశారు. కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, మహిళా మండలి అధ్యక్షురాలు షైలవరం నిర్మలాదేవి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల మహోత్సవం



బోనాల ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

చెన్నేకొత్తపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం గ్రామంలో గ్రామదేవత పెద్దమ్మతల్లికి బోనాల మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతకు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి చేస్తాం: పీడీ

శింగనమల, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్ధాంతరంగా నిలిపోయిన అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిచేస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి తెలిపారు. మంగళవారం శింగనమల ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేపట్టిన లబ్ధిదారుల ఫేస్ యాప్, ఈకేవైసీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీడీపీఓ లలితమ్మ, సూపర్‌వైజర్లు కల్పన, ధన, కౌసల్య, వాణిశ్రీ, జ్యోతి, నేతాజీ, ఓబిలేసు, గాయత్రి పాల్గొన్నారు.

ఘనంగా చమన్ సాబ్ జయంతి



చమన్‌సాబ్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

అనంతపురం టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ చైర్మన్ చమన్‌సాబ్ 65వ జయంతిని మంగళవారం రామగిరి మండలం ఆర్ కొత్తపల్లిలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు, చమన్‌సాబ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఉమర్ ముక్తియార్, చమన్‌సాబ్ సతీమణి రమీజా బేగంలతోపాటు పలువురు టీడీపీ నాయకులు చమన్‌సాబ్ ఘాట్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఉమర్ ముక్తియార్ మాట్లాడుతూ తన తండ్రి చమన్‌సాబ్ ఆశయ సాధనే లక్ష్యంగా దూదేకుల కులస్తులను, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పామిడి మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్, జేడీఎస్ నాయకుడు మున్నా పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు: మాజీ మంత్రి

శింగనమల, జూలై 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వైసీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ మంత్రి సాకే శైలజనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక వాసవీ కల్యాణమండపంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వైసీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం చిన్నపాటి సంఘటన జరిగినా అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తోందన్నారు. పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా భయపడే పరిస్థితి లేదన్నారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అప్పుడు పోలీసులకు, కూటమి నాయకులకు ఇవే పరిస్థితులు తప్పవన్నారు. తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి పూల ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, గురుమూర్తి రెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అలీబాషా పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభం



ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ట్రస్టు చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహంలో రూ.1.30 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంటును ఏర్పాటుచేశారు. సాహితీ గగన్‌మహల్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్వో ప్లాంటును వితరణ చేసింది. స్థానిక హాస్టల్‌లో మంగళవారం ట్రస్టు చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆర్వో ప్లాంటును ప్రారంభించారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

గార్లదిన్నె, జూలై 15(ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక వృత్తిదారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కల్లూరు గ్రామంలో ఘనంగా గంగమ్మ జాతర నిర్వహించారు. గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజకులు గంగమ్మతల్లికి బోనాలు సమర్పించి దర్శించుకున్నారు. జాతరకు రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య, అధ్యక్షులు, కార్యదర్శులు హరికృష్ణ, నాగప్ప హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. రుద్ర, రైల్వే పుల్లన్న, రామాంజి, వెంకటేష్, రాజు, కిష్ట, గుర్రప్ప, శంకర్ పాల్గొన్నారు.

ఈఈ పరిపాలనా విభాగానికి దిక్కెవరు?

● పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్‌రెడ్డికి ఎస్ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు ● సిబ్బంది ఇష్టారాజ్యం ● సమయపాలన పాటించని వైనం

అనంతపురం న్యూటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఈఈ పరిపాలన విభాగానికి దిక్కెవరన్న చందంగా పరిస్థితి తయారైంది. ఇక్కడ ఈ ఈగా ఉన్న ప్రభాకర్‌రెడ్డికి ఇన్‌చార్జి ఎస్ఈ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఈఈ కార్యాలయంతో పాటు ఎస్ఈ కార్యాలయాన్ని కూడా చూసుకోవాల్సిన పరిస్థితి. ఆయన బాధ్యతగా ఉదయాన్నే ఈఈ కార్యాలయానికి వచ్చి ఎదైనా ఫైల్స్ ఉంటే వాటిని పూర్తి చేసుకొని ఎస్ఈ కార్యాలయానికి వెళుతున్నారు. దీన్ని ఆసరగా తీసుకున్న సిబ్బంది ఇక మనల్ని అడిగేవారెవరన్న విధంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విభాగానికి ప్రత్యేకంగా సూపరింటెండెంట్, ఏఓ మిగిలిన సిబ్బందిని గాడిలో పెట్టాల్సింది పోయి వారే సమయపాలన పాటించకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. పరిపాలన విభాగం అంటే వీరికి ఎలాంటి క్షేత్రస్థాయి బాధ్యతలు ఉండవు. విధినిర్వహణ మొత్తం కార్యాలయంలోనే ఉంటుంది. అలాంటిది వారే సమయపాలన పాటించకపోవడంతో కంచే చేను మేసినట్లుగా తయారైంది. మంగళవారం ఉదయం 11 గంటలైనా కార్యాలయానికి వచ్చేవారే కనిపిస్తుంటారు. ఇక మధ్యాహ్నం 1 గంట ఎప్పుడు అవుతుందా అని చూసే వారే ఎక్కువ, 1 గంట కాకనే పోయేవారు కూడా ఉన్నారు. తిరిగి 2 గంటలకు అంతా రావాల్సిన వారు 3 గంటలైనా ఏ ఒక్కరు రారన్న విమర్శలు ఉన్నాయి. మంగళవారం ఆంధ్రజ్యోతి విజిట్‌లో అది బట్టబయలు అయింది. భోజనానికి వెళ్లిన వారు 3 గంటలైనా ఏ ఒక్కరు రాలేదంటే పరిస్థితి ఏమిటన్నది అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఈఈ తగిన చర్యలు చేపట్టి సిబ్బంది సమయపాలన పాటించేలా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న పంచాయతీరాజ్ ఈఈ పరిపాలన విభాగం

ఆంధ్రజ్యోతి విజిట్

అభివృద్ధికి అడ్డుపడుతూ.. విమర్శలా..?

● ఏ ప్రతిపాదన పంపినా అడ్డంకులు
● మేయర్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ఫైర్

అనంతపురం క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధికి అడ్డుపడటమే కాకుండా మేయర్ విమర్శలు చేయడం సరికాదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఫైర్ అయ్యారు. మంగళవారం స్థానిక 47వ డివిజన్‌లో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొనగా టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంచుతూ ముందుకు సాగారు. పింఛన్‌దారులు, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఏడాది పాలనపై అభిప్రాయం తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చిన ఏడాదిలో అనూహ్యమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గాంధీ జయంతి అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా తరలిస్తామన్నారు. ఇప్పటికే రూ.118 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. త్వరలో నడిమి వంక, మరుకవంక పనులు చేపడుతామన్నారు. నగరంలో ఈ స్థాయిలో అభివృద్ధి జరుగుతుంటే మేయర్ వసీం అడ్డుపడటమే కాకుండా విమర్శలు చేస్తున్నారన్నారు. ఏ ప్రతిపాదనలు పంపనా 45 మంది కార్పొరేటర్లు ఉన్నా కౌన్సిల్ తీర్మానం తీసుకోడంలో జాప్యం చేస్తూ.. అడ్డపడుతున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా రానున్న నాలుగేళ్లలో రాష్ట్ర మొత్తం అనంతపురం వైపు చూసేలా అభివృద్ధి చేసి తీరుతామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రంగస్వామినగర్‌లో ఉన్న నడిమివంకను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, ఇతర నాయకులు రమాదేవి, తలారి ఆదినారాయణ, పీఎల్ఎన్ మూర్తి, డిష్ నాగరాజు, ఈటే స్వామిదాస్, సాకే లక్ష్మీనరసింహ, ఫిరోజ్ అహ్మద్, సంగా తేజస్విని, సుధాకర్ యాదవ్, తొండపునాటి రమేష్, బల్లా పల్లవి, సరళ, దుర్గేష్, రాయల్ మధు, నెట్టెం బాలకృష్ణ, చేపల హరి, మణి రవి, దాడి మల్లికార్జున, వడ్డేభవాని, వెంకటేష్, టైలర్‌శీన, నాగభూషణం పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

కొనసాగిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

అనంతపురం క్లాక్‌టవర్/క్రైం, జూలై15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె మూడో రోజు మంగళవారం కొనసాగింది. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లిన కార్మికులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకట నారాయణ, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ నంబరు 36ప్రకారం పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న విధంగానే రూ.21,000 వేతనాలు ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పదవీవిరమణ వయస్సు 62సంవత్సరాలకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కార్మికుల సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సంజీవరాయుడు, మురళీ, పోతులయ్య, తిరుమలేష్, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, సుబ్బిరెడ్డి, సలీం, రవికిరణ్, రవి, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, సుజాత పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

ఆర్థిక ఇబ్బందులతోనే దేవరాజ్ ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, జూలై15(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగర శివారు తడకలేరు వంకలో లభ్యమైన మృతదేహం బెంగళూరుకు చెందిన దేవరాజ్‌ది ఆత్మహత్యగా పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం దేవరాజ్ కుమారుడు జోసెఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరుకు బెంగళూరుకు చెందిన దేవరాజ్ (56) అనే వ్యక్తి పలు ప్రైవేట్ కంపెనీల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండేవాడని తెలిపారు. ఆరు మాసాల నుంచి ఇంటి అద్దె కూడా చెల్లించలేదని, ఇంటికి కూడా సరిగా వచ్చేవాడు కాదన్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైసీపీ నేతలకు రిమాండ్

బుక్కరాయసముద్రం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో 9వ తేదీన టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన 8 మంది వైసీపీ నేతలను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ పుల్లన్న తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉన్న వారిని అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు హాజరుపరిచారు. జిల్లా న్యాయాధికారి దాడి చేసిన వారిని 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ ఘటనలో మరికొంత మందిపై కేసు నమోదు చేశామని వారిని త్వరలోనే అరెస్టు చేయనున్నట్లు తెలిపారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యలలో భాగంగానే చెన్నంపల్లి ఘటనలో వైసీపీ నేతలపై అక్రమ కేసు బనాయించారని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీసుస్టేషన్ వద్దకు వైసీపీ నాయకులతో ఆందోళన చేసేందుకు ఆయన వచ్చారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ పుల్లన్నతో తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుడు, అతడి కుమారుడిపై ఫిర్యాదు

గార్లదిన్నె, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత కల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహులు, అతని కుమారుడు విశ్వనాథ్‌పై మంగళవారం పోలీసులకు ఎంఈఓలు వెంకటరమణ నాయక్, తారా చంద్రానాయక్ ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు మండల ఎంఈఓలు విధుల్లో భాగంగా పాఠశాలలను సందర్శించేవారు. మంగళవారం పాఠశాలల సందర్శనకు కల్లూరు వైపు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. అదే సమయంలో పాతకల్లూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విధులకు ఆలస్యంగా రావడం గుర్తించారు. ఎంఈఓలు పాఠశాలకు వెళ్లి విధులకు ఎందుకు ఆలస్యంగా వచ్చారని, కారణాలను తెలపాలని ప్రధానోపాధ్యాయుడు నరసింహులను వివరణ అడిగారు. ఆయన కుమారుడు విశ్వనాథ్ అనే వ్యక్తి బయట నుంచి పాఠశాలలోకి వచ్చి మా నాన్న ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని ఎంఈఓలపై వాగ్వాదానికి దిగాడు. వాగ్వాదంలో విశ్వనాథ్ మండల విద్యాశాఖ అధికారుల ఇరువురి సెల్‌ఫోన్లను లాక్కొని పగులగొట్టారు. ఈ ఘటనపై ఎంఈఓలు గార్లదిన్నెలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌ను అడగగా ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవమేనని విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

అనంతపురం క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని 4వ పట్టణ పోలీ స్టేషన్ పరిధిలో బైక్ మిస్సింగ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. మంగళవారం నాలుగో పట్టణ సీఐ జగదీష్ తెలిపిన మేరకు నరసింహాచారికి చెందిన స్ప్లెండర్ ప్లస్ బైక్ 7వ తేదీ రాంనగర్‌లో కనిపించకుండా పోయింది. పలు ప్రాంతాల్లో వెతికినా లభించకపోవడంతో 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి

గార్లదిన్నె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పని సరిగా ఉండాలని రవాణా శాఖ ఎంవీఐ సునీత అన్నారు. మంగళవారం సాయంత్రం తలగాసిపల్లి జంక్షన్ వద్ద శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషాతో కలసి స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను, డ్రైవర్ లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రైవేట్ స్కూల్ బస్సులలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అడ్‌హక్ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూలు

అనంతపురం రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ బీఈడీ కళాశాలలో అడహక్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అడ్‌హక్ ఫ్యాకల్టీ ఎంపిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు చేశారు. కమిటీ కన్వీనర్‌గా కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, సభ్యులు ప్రొఫెసర్ ఆంజనేయులు, నరసింహన్ వ్యవహరించారు. అడహక్ టీచింగ్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఏడుగురిని ఒక్కొక్కరికి డెమో ఇప్పించారు. విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అనంతరం ఫ్యాకల్టీ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ వైస్ చాన్స్‌లర్ అనిత ఆదేశాల మేరకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఆమేరకు నివేదికను తయారుచేసి వర్సిటీ అధికారులకు అందజేస్తామన్నారు.

ప్రజల్లో సంతృప్తస్థాయి పెరిగేలా పనితీరు ఉండాలి

అనంతపురం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందిస్తున్న సేవలు వారి సంతృప్తి మేరకు ఉండేలా చూడాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పలు శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడు తూ ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజా స్పందన సమీక్ష ఉన్నతస్థాయిలో సమీక్షిస్తున్నారని, అన్ని శాఖల వారి పనితీరు ఆ దిశలో ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్, జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, నర్సులు ముఖ ఆధారిత అటెండెన్స్ వేయాలని ఆదేశించారు. భూముల సర్వేలో ముందస్తు నోటీస్ అందించి సక్రమంగా చేయాలని సూచించారు.

ముస్సోరీకి జేసీ: జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ముస్సోరీకి బయలుదేరి వెళ్లారు. అక్కడ 16, 17, 18తేదీల్లో మూడురోజుల పాటు శిక్షణ పొందుతారు. అనంతరం 19 లేదా 20వ తేదీన జిల్లాకు వస్తారు.

త్వరలో కంపోస్ట్ యార్డులో బయోరెమిడేషన్ ప్రారంభం

● ప్లాస్టిక్ నిషేధంపై రాజీ ప్రసక్తేలేదు
● నగర పాలక సంస్థ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కంపోస్ట్ యార్డులో త్వరలో జిగ్మా సంస్థ ఆధ్వర్యంలో బయో రెమిడేషన్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. మంగళవారం నగరంలో కమిషనర్ వివిధ ప్రాంతాల్లో విస్తృత పర్యటన చేశారు. ఉదయం గుత్తిరోడ్డులో ఉన్న కంపోస్ట్ యార్డును పరిశీలించిన కమిషనర్...రోజు వారి చెత్తసేకరణలో భాగంగా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని...ఇందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జిగ్మా సంస్థ ఆధ్వర్యంలో త్వరలో బయో రెమిడేషన్, బయో మైనింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎటువంటి అవకతవకలు, పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ సాగుతుందన్నారు. అనంతరం అరవింద్ నగర్, విద్యుత్తు నగర్, జీసెస్‌నగర్‌లలో పర్యటించారు. పారిశుధ్య పనులు, ఇంటింటా చెత్త సేకరణ పరిశీలించారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమలుపై రాజీపడే ప్రసక్తే లేదని, ప్లాస్టిక్ విక్రయాలు అరికట్టడానికి విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, ఈఈలు షాకీర్, నరసింహులు, డిప్యూటీ కమిషనర్ పావని, ఎంహెచ్ఓ రంగస్వామి పాల్గొన్నారు.



కంపోస్ట్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి, అధికారులు



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న పరిటాల సునీత

పొలాలకు దారి చూపండి

● ఎమ్మెల్యే పరిటాల సునీతను కోరిన రైతులు

ఆత్మకూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పొలాల్లోకి వెళ్లేందుకు వైసీపీ నాయకులు దారులు మూసేస్తున్నారని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మదిగుబ్బ గ్రామస్థులు ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఏడాదికాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గత ఐదేళ్లకాలంలో పొలాల్లోకి వెళ్లేందుకు వైసీపీ నాయకులు దారులు మూసేశారని ఎమ్మెల్యే ఎదుట రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో రీ సర్వేపేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్, మల్లికార్జున రెడ్డి, సుబ్రహ్మణ్యం, కన్వీనర్ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నరసింహచౌదరి, నాగేంద్ర, పోతులయ్య, బోమ్మయ్య, బాలు, కందుల ఓబుళపతి, రామదాసు, పూల ఓబుళపతి, వెంకటనారాయణ, సూరి, నాగరాజు, అక్కులన్న పాల్గొన్నారు. అనంతరం ఐదుగురు ప్రమాద బాధితులకు జిల్లాకేంద్రంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నేకొత్తపల్లి/రామగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం చెన్నేకొత్తపల్లికి వస్తున్నట్టు టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు నీకేపల్లిలోని కేజీబీవీలో రూ.1.60లక్ష అదనపు భవన నిర్మాణానికి భూమి పూజ, వెంకటంపల్లిలో గోకులం షెడ్‌లు, డ్రోన్ ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యే పరిటాలసునీత బుధవారం రామగిరిలో పర్యటించనున్నట్టు మండల కన్వీనర్‌సుదాకర్, ప్రధానకార్యదర్శి ఆవుల ముత్యాలు మంగళవారం ప్రకటనలో తెలిపారు.

అవకాశాల సద్వినియోగంతోనే సత్ఫలితాలు

అనంతపురం టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అవకాశాలను సద్వినియోగం చేసుకున్నపుడే సత్ఫలితాలు వస్తాయని సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అన్నారు. సాయినగర్‌లోని సాయి వృత్తి శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం ట్రస్టు అధ్యక్షుడు ప్రశంసా పత్రాలు అందజేవారు. ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే బాధ్యత విద్యార్థులపై ఉందని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ట్రస్టు సభ్యుడు రాఘవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సభకు హాజరు

అనంతపురం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నరసరావుపేటలో సభను నిర్వహించారు. ఈ సభకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు రాఘవేంద్రచార్, నాయకులు అవధానం రాజా, రఘు, తేజలు హాజరయ్యారు. అనంతరం జిల్లా నాయకులను రాష్ట్ర నేతలు సన్మానించారు.

ఎన్‌సీసీ కార్యాలయం సందర్శన

అనంతపురం రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట బైపాస్ సమీపంలోని ఎన్‌సీసీ కార్యాలయాన్ని ఏపీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలాని మంగళవారం సందర్శించారు. కార్యాలయంలోని సిబ్బందితో ఆయన మాట్లాడారు. అకౌంట్స్ గురించి ఆరాతీశారు. ఎన్‌సీసీ నగర్‌లో జరుగుతున్న తాల్సేన క్యాంపు గురించి అడిగితెలుసుకున్నారు. ఆ మేరకు తగిన సలహాలు, సూచనలు చేశారు. కర్నూలు ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి, ఎమ్మెస్ కులకర్ణి, సీనియర్ జేసీఓ బల్వీర్ సింగ్, సుబేదార్ ఇంద్ర బహుదూర్ చక్రి, కార్యాలయ సూపరింటెండెంట్ తోట నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏపీ డైరెక్టర్ జనరల్ నర్సింగ్ సైలాని

నూతనోత్సాహం..!

ఎస్కేయూకు నూతన కోర్సుల మంజూరు పట్ల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలకు రెండురోజుల క్రితం నూతన కోర్సులు మంజూరైన విషయం విదితమే. కళాశాలకు కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సులకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్కేయూ వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరయ్యారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలకు నూతన కోర్సులకు అనుమతులు రావడం సంతోషంగా ఉందన్నారు. అదనపు కోర్సులు రావడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ తిమ్మప్ప, పరీక్షల కంట్రోలర్ లోకేశ్, డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించేలా చూడండి

ఎస్కేయూలో బోధనేతర సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని వైస్ చాన్స్‌లర్ ఆచార్య అనిత సూచించారు. మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల అధిపతులు, కో-ఆర్డినేటర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. విషయంలోని పలు అంశాలపై చర్చించారు. బుధవారం నుంచి జరగనున్న పీజీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ సవ్యంగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థుల వసతి గృహాల బకాయిలపై దృష్టిసాధించాలన్నారు. రెక్టార్ ఆచార్య వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు పాల్గొన్నారు.

నైపుణ్యం కలిగిన యువతకు దేశంలో కొరతలేదు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): దేశంలో నైపుణ్యం కలిగిన యువతకు కొదవలేదని మై భారత్ అధికారులు అన్నారు. ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ సమీపం మై భారత్ కార్యాలయంలో చైల్డ్ ఫర్ ఇండియా, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, మై భారత్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదట వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మై భారత్ రాష్ట్ర కోఆర్డినేటర్ బిసాటి భరత్, జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మమత, శ్రీనివాసులు, అరవింద్, కనక శివమ్మ, జీవన్‌కుమార్, జయమారుతి, వంశీ, అంబరీష్, కార్తీక్ పాల్గొన్నారు.

వైసీపీ అసమర్థత వల్లే శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్య

వైసీపీ ఎంపీటీసీలపై టీడీపీ ఎంపీటీసీ మండిపాటు

కణేకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నాటి కాంట్రాక్టర్లు చేసిన తప్పిదాల వల్లే శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులకు నేటికీ జీతాల సమస్య వేధిస్తోందని టీడీపీ ఎంపీటీసీ నరేంద్ర వైసీపీ ఎంపీటీసీలపై మండిపడ్డారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు వైసీపీ ఎంపీటీసీలు గ్రామాల్లో శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె వల్ల నీరు అందడం లేదని టీడీపీ ప్రభుత్వంపై ఆరోపణ చేయగా.. ఎంపీటీసీ నరేంద్ర ఎదురుదాడికి దిగారు. వైసీపీ ఎంపీటీసీలతో వాగ్వివాదం చేశారు.


వైసీపీ ఎంపీటీసీలతో టీడీపీ ఎంపీటీసీ నరేంద్ర వాగ్వాదం

న్యూస్ బాక్స్

తాడిపత్రి ఇన్నర్‌వీల్ క్లబ్‌కు అవార్డులు

తాడిపత్రి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ఇన్నర్‌వీల్ క్లబ్‌కు మూడు అవార్డులు వచ్చాయని అధ్యక్షురాలు కౌసర్‌బేగం మంగళవారం తెలిపారు. ఉత్తమ అధ్యక్షురాలుగా కౌసర్‌బేగం, ఉత్తమ కార్యదర్శిగా రేణుకాదేవి, కోశాధికారిగా శ్రీవాణి అవార్డులు గెలుపొందారని, కర్ణాటకలోని హోస్పేట్‌లో వారు ఆ అవార్డులు అందుకున్నారని తెలిపారు.

ఘనంగా పామిడమ్మ తిరునాల


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణ గ్రామ దేవత పామిడమ్మ అమ్మవారి తిరునాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది.

పుట్లూరు రోడ్డు గేట్ బంద్

తాడిపత్రి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పుట్లూరు రోడ్డు రైల్వేగేటును బుధ, గురువారాలు మూసివేస్తామని సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రాఘవరెడ్డి తెలిపారు. లెవల్‌క్రాసింగ్ గేట్ హైట్ గేజ్ రిపేరు కారణంగా బంద్ చేస్తున్నామని, ఆటోనగర్, ఆర్డీటీ కాలనీ, పుట్లూరు వైపు వెళ్లే వాహనదారులు అనంతపురం ఫ్లైఓవర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మీదుగా వెళ్లాలని సూచించారు.

22న బహిరంగ వేలం

ఉరవకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22న తలనీలాలు, టెంకాయలు విక్రయించుకునే హక్కు, కొబ్బరి చిప్పల సేకరణకు, సామాన్లు బాడుగకు, కలగలపు బియ్యానికి వేలం పాట నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలిచిన డిపాజిట్ చెల్లించాలన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గుంతకల్లుటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతగుంతకల్లులోని హజరత్ సయ్యద్ మస్తాన్ వలి దర్గాలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఏడాది పాటు భక్తులు దర్గాలోని 10 హుండీల్లో వేసిన కానుకలను లెక్కిస్తున్నారు. అర్ధరాత్రి అయినా లెక్కింపు కొనసాగుతోంది.

భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవం

గుంతకల్లుటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పూర్వాభద్ర తిరునక్షత్రం సందర్భంగా కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మన్యుసూక్త హోమాన్ని మంగళవారం నిర్వహించారు. రాత్రి వెండి రథంలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

తాడిపత్రి ప్రజలకు రుణపడ్డాం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

తాడిపత్రి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి నియోజకవర్గ ప్రజలకు, మహిళలకు జేసీ కుటుంబం ఎప్పటికి రుణపడి ఉంటుందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దారెడ్డి చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావనీ, అలాంటి వ్యక్తి తాడిపత్రికి వస్తే అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. భైరెడ్డి సిద్ధార్థరెడ్డి తన భాష, యాస, ప్రవర్తన మార్చుకోవాలని, లేకుంటే భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు.

కమిటీ ఎన్నిక

రాయదుర్గం రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు పాస్టర్ మార్క్, జిల్లా ఈసీ మెంబర్ జాషువా మంగళవారం పేర్కొన్నారు. అధ్యక్షుడిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా మోషే, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరి, కార్యదర్శిగా సతీష్ దానియేలు, సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా వేలంపాట

బొమ్మనహాళ్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నేమకల్లులో శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం టెంకాయల వేలం పాట నిర్వహించారు. దేవదాయశాఖ రాయదుర్గం, కణేకల్లు గ్రూప్ ఈఓలు నరసింహరెడ్డి, దేవదాసు ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. నేమకల్లు గ్రామానికి చెందిన కాంతరాజు రూ.6.71 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది. రూ.6.22 లక్షలు పోగా ఈసారి రూ.49 వేలు అధిక ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

పారిశుధ్యం పరిశీలన

యాడికి, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్, ప్రభుత్వ వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రం, చెన్నకేశవస్వామి ఆలయం, సచివాలయం తదితర వాటిని కేంద్ర బృంద సభ్యుడు రామచంద్ర మంగళవారం పరిశీలించారు. అక్కడ మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత, పారిశుధ్యం నిర్వహణ తదితర అంశాలను తనిఖీచేశారు. ఆయన వెంట వైద్యుడు సాయిసుశాంత్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శులు రాంసతీష్, హాజివలి; డిప్యూటి ఎంపీడీఓ శశికళ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2025 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 21న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, 23న గాంధీ చౌక్‌లోని ఐటీఐ కళాశాలలో కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9985146746, 9979361066 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

గుంతకల్లు టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నడిరోడ్డుపై ఈ నెల తొమ్మిదో తేదీన జనసేన వీర మహిళ విజయజ్యోతిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక టీబీ రోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. ఈ దాడిపై పోలీసులు కేసు నమోదు చేసినా.. ఇంతవరకూ నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. ఈ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లామని నాయకులు పవన్, గోపి, విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రహరీని నిర్మించండి

శెట్టూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీని నిర్మించాలని పాఠశాల కమిటీ చైర్మన్ ఎం తిప్పేస్వామి, హెచ్ఎం ఫిరోజ్ ఖాన్ డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాలకు రెండు వైపులా మాత్రమే ప్రహరీ ఉందని, మిగిలిన రెండు వైపులా ప్రహరీని నిర్మించాలని కోరారు.

సర్వసభ్య సమావేశంలో వైసీపీ నాయకుల పెత్తనం


ఎంపీపీ చాంబర్‌లో వైసీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డిని బుజ్జగిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వైసీపీ నాయకులు పెత్తనం చెలాయించారు. ఎంపీపీ పద్మ భర్త వైసీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, బొమ్మనహాళ్ ఎంపీటీసీ శివశరణమ్మ భర్త వైసీపీ నాయకుడు యువరాజులు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వలేదని, దీంతో సమావేశానికి హాజరుకారాదని వైసీపీ ఎంపీటీసీలకు హుకుం జారీ చేశారు. దీంతో వారు చేసిన సంతకాలను కొట్టేసి.. ఆ సమావేశాన్ని బాయికాట్ చేశారు. బిల్లులు పంపించామని, ట్రెజరరి నుంచి రాలేదని, సమావేశంలో మాట్లాడుతుదాం రండని ఆ ఎంపీటీసీలను తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. ఎంపీపీ చాంబర్‌లో ఉన్న ఎంపీపీ పద్మ భర్త చంద్రశేఖర్ రెడ్డితో అధికారులు చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. కోరం లేకపోవడంతో సమావేశాన్ని అధ్యక్షురాలు బుధవారానికి వాయిదా వేశారు.

యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం


గుత్తిలో వెంకటశివుడు యాదవ్ ప్రచారం

కంబదూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మర్రిమాకులపల్లి, గుద్దెళ్ల, ములకనూరు గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

● గుత్తి : మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు నిర్వహించారు. ఇందులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, వార్డు ఇన్‌చార్జి బాషా, నాయకులు రంగస్వామి, రసూల్, చికెన్‌శీనా, సురేష్‌గౌడ్, సురేంద్ర పాల్గొన్నారు.

● పామిడి : పట్టణంలోని 9, 13వ వార్డులలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నిర్వహించారు. ఇందులో టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌చౌదరి, సంజీవకుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, రామాంజనేయులునాయక్ పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ విజయం


గెలుపొందిన రైల్వే మజ్దూర్ యూనియన్ ప్యానల్

గుత్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైల్వే ఇనిస్టిట్యూట్ కమిటీ నూతన పాలకవర్గం ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్యానల్ విజయం సాధించింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగిన ఈ పోలింగ్‌లో 790 మంది ఓటర్లగాను 747 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మజ్దూర్ యూనియన్ ప్యానల్ ఘన విజయం సాధించగా... రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రెటరీగా నాయబ్ రసూల్, జాయింట్ సెక్రెటరీగా నుక్కు విజయ్‌కుమార్, కోశాధికారిగా కేఎస్ కృష్ణ, డైరెక్టర్లుగా బాలకృష్ణ, కంబయ్య, వెంకటేష్, రామాంజినేయులు, సుంకన్న, గణేష్‌సింగ్‌మినాలు గెలుపొందారు.

సింగిల్ విండో సభ్యుల నియామకం

గుత్తిరూరల్,జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) సింగల్ విండో అధ్యక్షుడిగా శివశంకర్ యాదవ్‌ను, సభ్యులుగా రమణ, సుంకన్నను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.


అధ్యక్షుడు శివశంకర్

వేరుశనగలో జింక్ లోపం

విడపనకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటలో జింక్, ఐరన్ లోపం ఉందని, దీంతో ఆకులు పసుపు రంగు మారుతున్నాయని రేకులకుంట శాస్త్రవేత్తలు ఎం విజయ్‌శంకర్‌బాబు, ఎల్ మాధవిలత తెలిపారు. మండలంలోని హావళిగి, పాల్తూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడారు. జింక్, ఐరన్ లోపం నివారణకు ఫెర్రస్ సల్ఫేట్, జింక్ సల్ఫేట్, ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. వేరుకుళ్లు తెగులుకు అధిక నీటి తడులు ఇవ్వకుండా ఉండాలని, నత్రజని ఎరువులు వాడకం తగ్గించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ ఏడీఏ ఎస్ సత్తనారాయణ, ఏఓ హెచ్ పెన్నయ్య, ఎఈఓ కైలాష్ పాల్గొన్నారు.

చిన్నపీర్ల సరిగెత్తు



కణేకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉరవకొండ ఏరియా, హెచ్చెల్సీ కెనాల్, దిగువగేరి తదితర ప్రాంతాల్లో చిన్నపీర్ల పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



గుంతకల్లుకు చెందిన టీపీఆర్ ట్రస్ట్ అధినేత తలారి పరశురాముడు మంగళవారం గుండె పోటుతో మరణించాడు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే జయరాం గుమ్మనూరు జయరాం, ఆయన కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. -గుంతకల్లు

బాలా నరేంద్రబాబు సేవలు ఎనలేనివి: ఎమ్మెల్యే


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణం మాజీ ఉప సర్పంచ్ బాలా నరేంద్రబాబు సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కొనియాడారు. అనారోగ్యంతో బాలా నరేంద్రబాబు సోమవారం రాత్రి మరణించారు. మంగళవారం రాత్రి బాలా నరేంద్రబాబు భౌతికకాయానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నివాళులర్పించారు. మాజీ ఉప సర్పంచ్‌గా పట్టణ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రాజగోపాల్, అవినాష్, టీడీపీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. మంగళవారం స్థానిక కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిపక్షపార్టీ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. అనంతరం మండలంలోని పరిస్థితులపై టీడీపీ నాయకులు మల్లాగుండ్ల రాజేంద్రనాయుడు, మండల కన్వీనర్ రామాంజనేయులు, అనీల్ కుమార్‌చౌదరి, రవీంద్రనాథ్‌రెడ్డి, మేడికుర్తి రామకృష్ణారెడ్డి, తిరుమలాపురం రమణారెడ్డితో చర్చించారు.

● మండలంలోని చింతకాయమందలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరాతీశారు.

ఆషాఢ మాసం పూజలు



గుంతకల్లులో వాసవీమాత, యాడికిలో అంబాభవాని అమ్మవార్లకు అలంకరణ

గుంతకల్లుటౌన్/యాడికి జూలై 15 (ఆంధ్రజ్యోతి): అషాఢ మాసం మూడో మంగళవారం పురస్కరించుకుని గుంతకల్లులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి అమ్మవారికి వివిధ రకాల పండ్లతో శాకంబరిగా అలంకరించారు. యాడికిలోని అంబాభవానీ ఆలయంలో అమ్మవారు వారాహిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వర్షాల కోసం ఆంజనేయుడికి జలాభిషేకం

గుత్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేసే వీధిలో ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం కాలనీ వాసులు వర్షాలు కురవాలని జలాభిషేకం నిర్వహించారు. స్వామివారికి 107 బిందెలతో జలాభిషేకం చేశారు.



ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలి


రిలే దీక్ష చేపట్టిన నిరసనకారులు

పామిడి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను కొనసాగించాలని ఐక్య మాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో సేవ్ ఆర్డీటీ నినాదంతో మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సూర్యనారాయణ, కేశవ, శంకర్, రాజ్‌కుమార్, మహిళా నాయకురాలు తపాల లక్ష్మి కూడా ఈ దీక్ష చేపట్టారు.

రైతులను ఆదుకోవాలి

గుంతకల్లుటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వర్షాలు లేక పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని సంగాల, దోసులుడికి, గుండాల తండా, మొలకలపెంట గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించిన వారు మాట్లాడారు. ఒక ఎకరాకు రూ. 10వేలు నష్టపోయారని, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు సాకేనాగరాజు, బాషా, రైతులు పాల్గొన్నారు.

నూతన కోర్సు ప్రారంభం

గుంతకల్లు టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాంలో బీఎఫ్ఎస్ఐ నూతన కోర్సు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాంలో బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ కోర్సు మూడు సంవత్సరాలు ఉంటుందని, తృతీయ సంవత్సరంలో విద్యార్థులకు గుంతకల్లు పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో అప్రెంటిషిప్ కల్పించి, స్టైఫండ్‌ను అందజేస్తామని, ఆయా బ్యాంకుల్లోనే ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కొత్త కోర్సు ద్వారా విద్యార్థులు పరిశ్రమల్లో అనుభవం సంపాదించడంతో పాటు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల్లో నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో కామర్స్ అధ్యాపకులను సంప్రదించాలన్నారు.

క్రైం న్యూస్..

కస్టమర్ల డబ్బుతో ఉడాయించిన స్వర్ణకారుడు


గోల్డ్ స్మిత్ షాపు వద్ద ఆందోళన చేపట్టిన బాధితులు

గుంతకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ స్వర్ణకారుడు కస్టమర్లను నమ్మించి, పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి ఉడాయించారు. పట్టణానికి చెందిన 30 మంది బాధితులు సోమవారం అతడి షాపు వద్దకు వచ్చి ఆందోళన నిర్వహించారు. పట్టణానికి చెందిన షేక్ నూరుల్లా పాత గుత్తి రోడ్డులోని చౌడమ్మ దేవాలయం వద్ద బంగారు నగల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇతడు తన పాత ఖాతాదారుల నుంచి బంగారు నగల కోసం వాయిదా పద్ధతి తో డబ్బు వసూలు చేసి, చెప్పిన మొత్తాలు చెల్లించిన తర్వాత నగలను తయారు చేసి ఇచ్చేవాడు. దాదాపు పదేళ్ల నుంచీ ఈ వ్యవహారం నడుతుండేవాడు. ప్రస్తుతం దుకాణం తెరవకుండా సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో డబ్బు చెల్లించిన వారు అతడి దుకాణం వద్దకు వచ్చి ఆందోళన నిర్వహించారు. బాధితులు మాట్లాడుతూ మూడు నెలల నుంచీ నూరుల్లా తమకు అందుబాటులో లేకుండాపోయాడన్నారు. మరి కొన్ని రోజుల్లో స్కీం పూర్తవుతుందని, తమకు నగలు చేసి ఇస్తాడని భావిస్తున్న తరుణంలో అదృశ్యమయ్యాడని వాపోయారు. ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు. షాపువద్ద ఆందోళన నిర్వహించిన వారు మాట్లాడుతూ 30 మంది దాదాపు రూ. 77 లక్షలు నూరుల్లాకు చెల్లించామని, తీరా ఇప్పుడు తమకు అన్యాయం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి చేతికి గాయం

గుంతకల్లు టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజనం సమయంలో ప్లేట్ కోసం జరిగిన తోపులాటలో పదో తరగతి విద్యార్థి రామన్న చేతికి గాయమైంది. ఆ బాలుడిని ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. భోజన సమయంలో ఉపాధ్యాయులు పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని డీవైఎఫ్ఐ నాయకులు సురేంద్ర, వంశీ, కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

గుత్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఎరువుల దుకాణాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణంలో సరైన వివరాలు లేని రూ.1.37 కోట్ల విలువ చేసే ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపేశారు. అలాగే చౌడేశ్వరి సీడ్స్‌ను, ఇండ్రస్ట్రియల్ ఏరియాలో ఉన్న కెమిసైడ్ పురుగుల మందు తయారీ ఫ్యాక్టరీని తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ సాలూరెడ్డి, స్థానిక ఏడీఏ వెంకటరాముడు, కర్నూల్ విజిలెన్స్ ఎస్ఐలు వీరేంద్ర, భూపతి, ఏఓ ముస్తాక్ అహ్మద్, జేడీఏ టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్ నాయక్ పాల్గొన్నారు.

● తాడిపత్రి : తాడిపత్రి పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ కమిషనర్ సాయిరెడ్డి, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో విజిలెన్స్ ఎస్ఐ నరేంద్ర, భూపతిరాజు, తాడిపత్రి ఏడీఏ రవి, వ్యవసాయాధికారి ఆంజనేయులు, ఏఓ రాకేష్ పాల్గొన్నారు.

లొంగిపోయిన హత్యకేసు నిందితుడు?

తాడిపత్రి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్వగడ్డవీధిలో టైలర్స్‌కాలనీకి చెందిన హరీష్ అలియాస్ హర్షను హత్య చేసిన కేసులో నిందితుడు నాగరాజు తాడిపత్రి కోర్టులో లొంగిపోయినట్లు సమాచారం. సోమవారం రాత్రి హరీష్‌పై నాగరాజుతో పాటు మరి కొంతమంది కత్తులు, కొడవండ్లతో దాడిచేసి.. పారిపోయారు. కొన ఊపిరితో ఉన్న హరీష్‌ను పోలీసులు స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి.. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక ఆయన మరణించాడు. నిందితులను అరెస్ట్ చేయాలని స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ సర్కిల్ వద్ద హరీష్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సమయంలోనే నిందితుడు నాగరాజు నేరుగా కోర్టులో లొంగిపోయినట్లు సమాచారం. కాగా, హరీష్‌కు భార్య సౌమ్య, కొడుకు ఉన్నారు.

పూడికతీత పనుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పొలాలకు సాగునీరు అందించే ప్రధాన కాలువలో పిచ్చిమొక్కల తొలగింపు, పూడికతీత పనులనుఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. కదరగుట్టపల్లి హెడ్ రెగ్యులేటర్ వరకు ఏళ్ల తరబడి పిచ్చిమొక్కలు ఎక్కువగా పెరగడంతో సాగునీరు వృథా అవుతోందని, దీంతో రాయలచెరువుకు, పంటపొలాలకు నీరు చేరకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి విడుదల సమయానికి ఈ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, గంగరాజు, నాగరాజు, చంద్రశేఖర్‌నాయుడు, చిరంజీవి, హరికృష్ణ ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

తాడిపత్రి: మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో మండలంలోని వీరాపురం, బొందలదిన్నె, కొండేపల్లి, వంగనూరు, బోడాయిపల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండబోదన్నారు.

వంటావార్పుతో కార్మికుల నిరసన


వంటావార్పులో పాల్గొన్న కార్మికులు

తాడిపత్రి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజైనా మంగళవారమూ కొనసాగింది. కార్మికులు వంటావార్పు కార్యక్రమంతో నిరసన చేపట్టారు. ఇందులో సీఐటీయూ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్, రాంమోహన్ పాల్గొన్నారు.

చిరుత సంచారం

బెళుగుప్ప, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న బెళుగుప్ప, బెళుగుప్ప తండా తదితర వ్యవసాయ తోటల సమీపంలో చిరుత సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి తోట వద్ద ఓ చిరుత తిరుగుతుండగా రైతులు అటవీ శాఖాధికారి పెద్దన్న దృష్టికి తీసుకెళ్లారు. పెద్దన్న మంగళవారం ఆ తోటల్లో చిరుత అడుగులు గుర్తించారు. ఒంటరిగా వెళ్లకూడదని ఆయన రైతులకు సూచించారు.